# పునరుత్థానము ప్రకటించునదేమి

క్రీస్తు మరణ, సమాధి పునరుత్థానములు మన విశ్వాసానికిని దేవునితో మనకున్న బాంధవ్యానికి కేంద్రమైయున్నాయి (1 కొరింథీ. 15:1–4). వారంలో మొదటి దినమున, మనం ప్రభువు బల్లచుట్టు కూర్చుండినప్పుడు,[1] క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాలను మనం జ్ఞాపకం చేసికొంటాం. వీటిలో మనమిప్పుడు మూడవ దానిమీద దృష్టినిలుపుదాం – అది "పునరుత్థానం యొక్క ప్రాధాన్యత ఏమి?" "ఆ గొప్ప సంఘటన ప్రకటించునదేమి?" అనే ప్రశ్నలకు జవాబు చెప్పగోరుతున్నాం. వాటి ప్రాథమిక సందేశాలలో యిక్కడ కొన్ని యివ్వబడ్డాయి.

## యేసు దేవుని కుమారుడైయున్నాడు

మొదటిగా, పునరుత్థానం క్రీస్తు దైవత్వాన్ని ప్రకటిస్తుంది "… మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను" అని పౌలు రోమా 1:4లో పలికాడు. పునరుత్థానం యేసు దేవుని కుమారుడని నిరూపిస్తుంది.

పునరుత్థానపు ఉదయాన క్రీస్తు దేహాన్ని సుగంధ ద్రవ్యాలతో అలదే పనిని ముగించ వచ్చిన స్త్రీలు సమాధిని సందర్శించినవారిలో మొదటివారు. మగ్దలేనే మరియ తక్కిన వారిని అక్కడ వదలి, పేతురు యోహానులను ఎదుర్కొన వెళ్లినట్టుంది. మరియ యొక్క సమాచారం అందుకున్న ఆ యిద్దరు అపొస్తలులు పరిశీలించడానికి సమాధి యొద్దకు పరుగెత్తారు. తాను సమాధిలోనికి చూచినప్పుడు నమ్మినట్టు తరువాత యోహాను తెలిపాడు. ముందు, అతడు ఏమి నమ్మాలో ఎరుగకయే పేతురుతో తోటలో ప్రవేశించాడు. తరువాత సమాధిలో ఏముందో అతడు చూచాడు. యోహాను యిలా వివరించాడు:

> అంతట సీమోను పేతురు అతని వెంబడి వచ్చి, సమాధిలో ప్రవేశించి, నారబట్టలు పడియుండుటయు, ఆయన తల రుమాలు నారబట్టల యొద్ద ఉండక వేరుగా ఒక చోట చుట్టిపెట్టి యుండుటయు చూచెను. అప్పుడు మొదట సమాధి యొద్దకు వచ్చిన ఆ శిష్యుడు[2] లోపలికి పోయి చూచినమ్మెను[3] (యోహాను 20:6–8).

విశ్వసింప దగినట్టిది యోహాను ఏమి చూసాడు? "నారబట్టలు పడియుండుటయు, ఆయన తల రుమాలు … వేరుగా ఒక చోట చుట్టి పెట్టియుండుటయు చూచెను." యేసు మృతదేహాన్ని ఎవరైనా తొందరగా అక్కడనుండి తరలించియుంటే,[4] చుట్టిన నారబట్టలను తొలిగించుటయు, తల రుమాలు నీటుగా వేరొకచోట చుట్టిపెట్టుటవంటి పనులు చేయడానికి వీలుగాని, అవసరంగాని ఉండదు. యోహాను చూచింది మానవ

సామర్థ్యానికి పొసగనిదే గాని, దైవికమైన జోక్యానికి పొందిక లేనిది కాదు. పునరుత్థానాన్ని గూర్చి ప్రభువు తరచుగా పలికిన దానికి అది అనుగుణమైనదిగానే ఉంది (మత్తయి 16:21; 17:23; 20:19; మార్కు 8:31; 9:31; 10:34; లూకా 9:22; యోహాను 2:19).

ఆ రుజువును నీవు నేను బహు జాగ్రత్తగా చూడడానికి సమయం తీసికొన్నట్టయితే, యోహానులో విశ్వాసం ఉద్భవించినట్టే మనయందును విశ్వాసం కలుగుతుంది. యేసు మృతులలోనుండి లేపబడ్డారనడానికి హేతువులు విస్తరించుతాయి. ఉదాహరణకు, ఆయన మృతులలోనుండి లేచిన తరువాత ఆయనను చూచిన వందలమంది నమ్మదగినవారి సాక్ష్యం ఉంది (1 కొరింథీ. 15:4-8).

దానికి క్రీస్తు శిష్యులలో కలిగిన మార్పు ఒక రుజువైయుంది. ఆయన బంధింపబడినప్పుడు గాని తీర్పు తీర్చబడేటప్పుడు గాని క్రీస్తు అనుచరుల ప్రవర్తన ఎవ్వరినీ ఆకట్టుకోలేదు. ధైర్యమన్నది వారికి లేదు. వారు ప్రాణాలపై తీపితో పారిపోయారు లేదా అపాయానికి బెదిరి దూరంగా తొలగిపోయారు. పేతురైతే యేసును ఎరుగననియు నిలిచాడు. అయినా, పునరుత్థానం తరువాత, వారే యేసును గూర్చి బహిరంగంగాను, ధైర్యంగాను ప్రకటించారు. వారు ఒప్పింపబడిన తీరు క్రొత్తనిబంధన పుటలన్నిటిగుండా మారుమ్రోగుతుంది.

వారు ఏ విషయమై అంత నిశ్చయంగా ఉన్నారు? వారి యేసు సజీవుడు, ఈ నిశ్చయత అపొస్తలుల జీవితాలనే మార్చివేసింది. వారు చెరసాలపాలైనా, కొట్టబడినా, రాళ్లతో కొట్టబడినా. చంపినా - వారి నమ్మిక చలనము లేనిదైయుంది. బలహీనులు, చంచలులు, విశ్వాసంలేని వ్యక్తులు, లోకము ఎన్నడూ ఎరుగనంత మహా గొప్ప సంచలనాత్మకమైన వ్యక్తులుగా మారిపోయారు. అది ఛిన్నాభిన్నమయ్యేటట్టుగా వారి ఉపదేశము రోమా సామ్రాజ్యాన్నే వణకించింది. పునరుత్థానాన్ని విడిచి వేరుగా ఆ మనుష్యులలో కలిగిన మార్పును వివరించ వల్లపడదు. పునరుత్థానుడైన ప్రభువును వారు చూచారు, అది వారి జీవితాలను శాశ్వతంగా మార్చివేసింది.

ఎంతోకాలం క్రితమే పునరుత్థానము యేసు దేవుని కుమారుడనే సత్యాన్ని రుజువు చేసింది, ఆ గొప్ప సత్యాన్ని అది నేటికిని ప్రకటిస్తుంది.

## క్రీస్తు బలి అంగీకరింపబడింది

సిలువపై క్రీస్తు బలిని దేవుడు అంగీకరించినట్టు పునరుత్థానము ప్రకటించింది. క్రైస్తవ్యం సిలువయందు కేంద్రీకృతమైయుంది. "సిలువ రక్తముచేత" మనం దేవునితో సమాధానపరచబడ్డాం (ఎఫెసీ. 2:16). క్రీస్తు బలివలన దేవుని న్యాయము సంతృప్తి పరచబడింది[5] దానినిబట్టి మనకు నిత్య జీవమును గూర్చిన నిరీక్షణ కలిగింది. "సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీమధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటినని" పౌలు తెలిపాడు (1 కొరింథీ. 2:2). వారంలో మొదటి దినాన, మనం ప్రభువు బల్ల చుట్టు కూడుకొనినప్పుడు, అది "ప్రభువు మరణాన్ని ప్రచురించడానికి"

ఉద్దేశింపబడింది (1 కొరింథీ. 11:26).

ఏదియెలాగున్నా, యేసు మృతులలోనుండి లేపబడకయుండియున్నట్టయితే, సిలువ ఆ ఉద్దేశాన్ని నెరవేర్చిందో లేదో మనకు నిశ్చయత కలిగే వీలు ఉండేది కాదు. మన పాపములకొరకు క్రీస్తు ప్రభువు బలిని దేవుడు అంగీకరించినట్టు ఆయన పునరుత్థానం ప్రకటించింది. దీని ప్రకారం, మనము క్రీస్తు మరణమును బట్టి మాత్రమే గాక, ఆయన పునరుత్థానమువలనను రక్షింపబడినవారమైయున్నాం. అందును బట్టియే "ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" అని పౌలు వివరించాడు (రోమా 4:25).

## మనం రక్షింపబడగలం

క్రీస్తు బలిని దేవుడు అంగీకరించిన దానికి ప్రతిఫలముగా వచ్చిన సంతోషకరమైన ఫలితము నీవు నేను రక్షింపబడగలగడమే! పాపమునుండి నూతన జీవము పొంది నడుచుకొనుటకు మనము లేపబడుదుమని పునరుత్థానం ప్రకటించింది.

ఆత్మ సంబంధంగా స్వస్థపరచగలననుటకు క్రీస్తు ఒకప్పుడు భౌతికమైన స్వస్థతలను చేశాడు (మత్తయి 9:6 చూడు). అలాగే, క్రీస్తు శరీర పునరుత్థానికిని నూతన జీవమునకు లేపబడే ఆత్మ సంబంధమైన మన పునరుత్థానానికిని సంబంధమున్నట్టు బైబిలు నొక్కి పలుకుతుంది. రోమాలోని క్రైస్తవులకు పౌలు యిలా రాశాడు,

> కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగల వారమైనయెడల, ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగల వారమైయుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము (రోమా 6:4-6).

పౌలు ఎఫెసీయులకు వ్రాసినప్పుడు, వారి మార్పును ఈ మాటలతో సంగ్రహం చేశాడు: "మనము మన అపరాధములచేత చచ్చినవారమై ఉండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను" (ఎఫెసీ. 2:5). క్రీస్తును మృతులలోనుండి లేపినప్పుడు, "ఆయన క్రీస్తునందు వినియోగ పరచిన బలాతిశయమును బట్టి" దేవుని ఆశీర్వాదములు అనుగ్రహించబడతాయి (1:19బి, 20ఎ; వచనాలు).

## మనకు సజీవుడైన రక్షకుడున్నాడు

ఒక్కసారి మన గత పాపములనుండి మనము రక్షింపబడియున్నాము. అయితే

క్రైస్తవ జీవితం జీవించడానికి మనకు సహాయం కావాలి. మనకొరకు "విజ్ఞాపనచేయు సజీవుడైన రక్షకుడు" మనకు ఉన్నట్టు పునరుత్థానం ప్రకటిస్తుంది (హెబ్రీ. 7:25). మన విశ్వాసము, భక్తి మృత సూత్రానికి లేక విధికి గాక, సజీవ వ్యక్తికి చెందినదైయుంది.

సదాకాలం మనతో నుండ ప్రభువు మాట యిచ్చారు (మత్తయి 28:20). మనం కూడివచ్చినప్పుడు, ఆయన అక్కడ ఉంటానని మాట యిచ్చారు (మత్తయి 18:20). ఆయన మన, "కనికరమును నమ్మకమును గల ప్రధాన యాజకుడై"యున్నట్టు హెబ్రీయుల పుస్తకం తెలుపుతుంది. మనము శోధింపబడినప్పుడు ఆయన సహాయము చేయగలవాడని, మన బలహీనతలయందు జాలిగలవాడైయున్నాడని సూచిస్తుంది (2:17; 4:15; 2:18). ఆయన ద్వారా మనకు "సమయోచితమైన సహాయము కొరకు కృప పొందుదుము" (హెబ్రీ. 4:16).

ఆయన మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడడం మాత్రమే గాక, "ఆయన జీవించుటచేత మనము రక్షింపబడుదుము" (రోమా 5:10) సజీవుడైన, లక్ష్య పెట్టువాడైన రక్షకుని బట్టి దేవునికి స్తోత్రము!

## ఒక దినము ప్రత్యేకించబడింది

ప్రత్యేకమైన ఉద్దేశం కొరకు ఒక దినము విడిగా ఉంచబడినట్టు కూడా పునరుత్థానము ప్రకటించింది. "ప్రత్యేకమైన ఉద్దేశంకొరకు ఒక దినం ప్రత్యేకించబడింది" అని అన్నప్పుడు, క్రైస్తవ ఉత్సవములకొరకు సంవత్సరంలో ఒకటో రెండో దినాలు వేరుగా ఉంచబడ్డాయని నా ఉద్దేశం కాదు (గలతీ. 4:10 చూడు) సరిగదా, పాత నిబంధనలో ప్రత్యేకపరచబడినట్టు వారంలో ఏడవ దినం (సబ్బాతును) ఆచరించాలని కూడా నా భావన కాదు (నిర్గమ. 20:8–11; ద్వితీయో. 5:12–15).

అయితే, "ఆదివారం" అని మనం పిలిచే వారంలో మొదటి దినాన్ని నేను సూచిస్తున్నాను. వారంలో తొలి దినాన, ఆది సంఘము ఆరాధించడానికి కూడింది – ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించడానికిని (అపొ. 20:7), కానుకలు సమర్పించడానికిని కూడింది (1 కొరింథీ. 16:2). ఈ మొదటి దినాన్ని అపొస్తలుడైన యోహాను "ప్రభువు దినము" అని పిలిచాడు (ప్రకటన 1:10).

క్రైస్తవులకు మొదటి దినం ఎందుకు ప్రత్యేకమయ్యింది? ఎందుకంటే, ప్రభువు ఆ దినాన మృతులలోనుండి లేచారు.[6] "వారు ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు సమాధి యొద్దకు" వచ్చారు (మార్కు 16:2). "కలవరపడకుడి సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు; ఆయన లేచియున్నాడు, ఇక్కడలేడు; వారు ఆయనను ఉంచిన స్థలము చూడుడి" అని దూత ఆ స్త్రీలకు తెలిపాడు (మార్కు 16:6). క్రైస్తవులకు, ప్రతి వారంలోని తొలి దినము, "పునరుత్థాన ఉదయమై యుంది."

## మనం కూడా, లేపబడతాం

తరువాత మనం పునరుత్థానంలోని పులకలు కలిగించే సందేశానికి వస్తాం. ఒకనాడు మన దేహాలు కూడా మృతులలోనుండి లేపబడతాయని అది ప్రకటిస్తుంది! చాలా కాలం క్రిందట, "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?" అని యోబు ప్రశ్నించాడు (యోబు 14:14). దానికి దేవుని జవాబు – "అవును – ఎందుకంటే క్రీస్తు లేపబడ్డారు!" ఈ సత్యము 1 కొరింథీ. 15లో స్థాపించబడింది:

> ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రదికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు ... కడపట నశింపజేయబడు శత్రువు మరణము" (20–26 వచనాలు).

"మేలు చేసినవారు" జీవ పునరుత్థానానికిని "కీడు చేసినవారు," "తీర్పు పునరుత్థానానికిని బయటికి" వస్తారు (యోహాను 5:29) – అయితే మనమందరం లేపబడేది ఖాయం. మరణం అనేది యిక ఎన్నడూ అడ్డుగోడయైయుండదు కాని ద్వారమై యుంటుంది. ఇది నిజమని పునరుత్థానం మనకు అభయమిస్తుంది!

## దేవుడు తన మాటకు బద్ధుడైయుంటాడు

మరో సందేశం గమనించాలని యిది మనుష్యులందరు నేర్చుకొనవలసిన సాధారణ సత్యం: దేవుడు తన మాటకు బద్ధుడైయుంటాడని పునరుత్థానం ప్రకటిస్తుంది. "దేవుడు ఏమంటే, దానికి అర్థం అదే!" సువార్తికులు చెప్పుతుంటారు.

తన పునరుత్థానాన్ని గూర్చి ప్రభువు చేసిన ప్రకటనలతని శ్రోతలలో చెరగని భావనగా మిగిలిపోయింది; అందులో ప్రత్యేకించి దేవాలయాన్ని గూర్చి ఆయన చేసిన సంక్షిప్త ప్రతిపాదన: "యేసు ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని వారితో చెప్పెను ... అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యిలా మాట చెప్పెను" (యోహాను 2:19, 21). కయప ముందు అబద్ధ సాక్షులు ఈ ప్రవచన వాక్యాన్ని క్రీస్తు ప్రభువునకు విరోధంగా కోట్ చేశారు (మత్తయి 26:61). యేసు సిలువపై ఉన్నప్పుడు, "– దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా ..." అంటూ అర్థరహితమైన మూక అన్నది (మత్తయి 27:40ఎ).[7]

ఈ ప్రవచనపు వాక్యాన్ని క్రీస్తు శత్రువులు నమ్మకపోయినా, అది నెరవేర్చబడింది. ఆయన శరీరము – తన భూసంబంధమైన దేవాలయం – సిలువలో చనిపోయింది, మరియు మూడవ దినమున, ఆ శరీరము లేపబడింది. ప్రభువు అలా జరుగుతుందంటే, అలాగే జరుగుతుంది, నీవు దాన్ని నమ్మవచ్చు!

## ముగింపు

పునరుత్థానం నమ్ముతామని కొందరంటారు – సంవత్సరంలో ఒక్కసారి దానిని ప్రధానంగా నొక్కి చూపుతారు. అదే సమయంలో పునరుత్థానమందు ప్రకటింపబడిన గొప్ప సత్యాలను వారు కాదంటారు:

- పునరుత్థానము యేసు దేవుని కుమారుడని ప్రకటిస్తుంది – అయితే అనేకులు ఆయన దైవత్వాన్ని ఒప్పుకోరు.
- దేవుని ఉగ్రతను సిలువ సంతుష్టిపరచిందని పునరుత్థానం ప్రకటిస్తుంది – కాని పాపము యొక్క నిజాన్నీ, పాపులను దేవుడు శిక్షించాలనే వాస్తవాన్నీ అనేకులు వద్దంటారు.
- క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థాల సాదృశ్యంలోనికి బాప్తిస్మం పొందునట్లు నడిపింపబడే మన విశ్వాసంవలన రక్షింపబడవచ్చునని పునరుత్థానం ప్రకటిస్తుంది (గలతీ. 3:26, 27) – కాని బాప్తిస్మం యొక్క అవసరత లేదని కొందరంటే, బాప్తిస్మమందు క్రీస్తును ధరించుకొనడానికి కొందరు నిరాకరిస్తారు.
- మనకొరకు విజ్ఞాపన చేసే సజీవుడగు రక్షకుడున్నట్టు పునరుత్థానం ప్రకటిస్తుంది – జీవితానికి వ్యక్తిగతమైన బలాన్ని దేవుడు ఏర్పాటు చేస్తాడనే భావాన్ని అనేకులు అపహసిస్తారు.
- వారంలో మొదటి దినం – ఆరాధనా దినంగా ప్రత్యేకపరచినట్టు పునరుత్థానం ప్రకటించింది – అయితే అనేకులు సంవత్సరంలో కొద్ది దినాలకే తమ హాజరును పరిమితి చేసికొంటారు.
- ఒకానొక దినం మనం లేపబడతామని పునరుత్థానం ప్రకటించింది – అయితే శరీర పునరుత్థానాన్ని అనేకులు లేదంటారు.
- తన మాట వెనుక దేవుడు నిలిచియుంటాడని పునరుత్థానం ప్రకటించింది – అయితే దేవుని వాక్య ఉపదేశాన్ని అనేకులు హేళన చేస్తారు.

చాల సంవత్సరాల క్రిందట, 760 సంవత్సరాల మహా గొప్ప గోతిక్ కెథడ్రల్, బ్రిటన్‌లో అంతటి పెద్దది అగ్ని ప్రమాదంవలన దగ్ధమగుటవల్ల ఇంగ్లాడు శోక సముద్రంలో మునిగిపోయింది. ఆ ప్రాచీన కెథడ్రల్ ప్రతి సంవత్సరం అనేకమంది యాత్రికులను ఆకర్షిస్తూ ఉండేది. ఆ అగ్ని ప్రమాదం కంటే మరీ ఘోరమైన మరొక దుర్ఘటన అక్కడే కొద్ది దినాల తరువాత జరిగింది: అదే కట్టడంలో, "The Rev. David Jenkins" అనే బూటకపు బిరుదుగల ఒకడు క్రీస్తు కన్య గర్భాన జన్మించిన సంగతిని నమ్మనని, క్రీస్తు నిజంగా మృతులలోనుండి లేచియుండలేదని బహిరంగంగా ప్రతిపాదించినవాడు – "Bishop of Durham"గా అభిషేకింపబడ్డాడు![8]

నీవు పునరుత్థానమునందు విశ్వసించుచున్నావా? అయితే దాన్ని ప్రకటించు! అలా జీవించు!

నీవు పునరుత్థానాన్ని నమ్మి, నీవు బాప్తిస్మము పొందవలసియుంటే, వెనుకాడకు.[9] ప్రాణములేని తన కుమారుని శరీరంలోనికి దేవుని శక్తి చేరి. ఆయనను మృతులలో నుండి ఎలాగు లేపిందో, అలాగే దేవుని శక్తి, ఆయన ప్రేమ నూతన జీవమును నీకు ప్రసాదించగలదు – ఆయన చిత్తానికి నీవు లోబడుటకు యిష్టపడినట్టయితే.

## నోట్సు

పునరుత్థానము యొక్క ప్రాముఖ్యతను అనేక మూలాలు నొక్కి చెప్తుతాయి. వాటిలో కొన్ని యిక్కడ యివ్వబడ్డాయి: W. T. Hamilton, *Show Us the Father* (Plainview, Tex.: Nichols Bros. Publishing Co., 1964), 200; H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 232; and Josh McDowell, *The Resurrection Factor* (San Bernardino, Calif.: Here's Life Publishers, 1981).

---

సూచనలు

[1]ప్రభువు తన భోజనాన్ని ఏర్పాటు చేసినప్పుడు, ఆయన మరణాన్ని ప్రచురిస్తారని నొక్కి చెప్పారు (1 కొరింథీ. 11:23–26). అయితే ప్రభురాత్రి భోజనానికిని పునరుత్థా నానికి కూడా దగ్గర సంబంధముంది. ప్రభువు ఆదివారాన లేచినందున (మత్తయి 28:1–6), సంఘం వారంలోని మొదటి దినాన కూడుతుంది. ప్రత్యేకించి ప్రభువు రాత్రి భోజనంలో పాల్గొనేందుకు (అపొ. 20:7; 1 కొరింథీ. 16:1, 2 కూడా చూడు). [2]"పేతురుతో ఉన్నవాడు ప్రభువుకు ప్రీతి పాత్రుడైన శిష్యునిగా గుర్తించబడ్డాడు" (యోహాను 20:2), అది తనను తాను యోహాను సంబోధించుకునే పద్ధతి అని చాలమంది విశ్వసిస్తారు (యోహాను 13:23; 19:26; 21:7, 20ను కూడా చూడు). [3]"Saw" గ్రీకు పదం కేవలం పరిశీలించడం అన్నదానికన్న అధికమైన అర్థాన్ని తెలుపుతుంది. అది అవగాహన అనేదాన్ని సూచిస్తుంది. [4]కొందరు ఇలా ప్రతిపాదించారు. యోహాను 20:2; మత్తయి 28:11–15లను చదువు. [5]లేఖనాలు ఈ మాటను మనము (propitiation) అని ఎక్కువగా వ్యవహారంలో లేని పదంతో సూచిస్తాయి (1 యోహాను 2:12;4:10). ఈ పదానికి కొంత వివరణ కావాలంటే "యేసు ఎందుకు మృతినొందెను" అనే వ్యాసాన్ని చదువు. [6]సబ్బాతు, మొదటి దినము అనే పదాలు "విశ్రమ" అనే సంఘటనతో మొదలై పవిత్రీకరించబడ్డాయి. సబ్బాతు ఏడవ రోజున విశ్రాంతితోనూ, మొదట రాజు ప్రభువు పునరుత్థానముతోను శుద్ధమయ్యాయి. [7]అపొ. 6:14లో సన్‌హెడ్రిన్ ప్రతిపాదనను కూడ చూడు. [8]Dick Marcear, "It's Time to Take a Stand," *Hilltop Reflections*, church bulletin of the Central church of Christ in Amarillo, Texas, 13 April 1986. నుండి ఈ ఉదాహరణ సేకరించబడింది. [9]బాప్తిస్మం ప్రాముఖ్యతను తెలిపే వాక్య భాగాలను ఉల్లేఖించాను. ప్రభువునుండి తొలిగి ఉంటే అట్టివాని పునరుద్ధరించే మాట అవశ్యకం (యాకోబు 5:16; అపొ. 8:22).